క్లుప్తంగా

పీహెచ్‌సీలో తనిఖీ



మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలను గుర్తించి సరైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వరూపరాణి, జయమ్మ, సూపర్‌వైజర్లు సత్యమ్మ, శ్రీధర్, జ్యోతి పాల్గొన్నారు.

రైతుబీమా చేసుకోవాలి

అలంపూర్ రూరల్: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అనిత మంగళవారం ప్రకటనలో కోరారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్‌తో ఆగస్టు 3వ తేదీలోగా ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఓ మహాలక్ష్మి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. నందిన్నెలో ఏఈఓ ప్రీతిసుధ రైతుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

హామీలను అమలుపర్చాలి

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండోవిడుత దళితబంధు పథకానికి అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో 2,200 మందిని ఎంపిక చేశారని, వారికి వెంటనే యూనిట్లను మంజూరు చేయాలన్నారు. దళితులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి అందించే అనేక సబ్సిడీలకు పాతర వేసి, దళితబంధు పేరుతో ఓట్లు దండుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు. వెంటనే రెండోవిడుత దళితబంధును మంజూరు చేయాలని, అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డుల తోపాటు విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. అంతకు ముందు మల్దకల్‌లో పత్తి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండలంలోని నెట్టెంపాడుకు చెందిన హన్మంతు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతకుముందు హన్మంతు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ఉపసర్పంచ్ గోవిందు, కుర్వ గోవిందు, గార్లపాడు మల్లేష్, జలగప్ప, ఎల్లప్ప, మల్లప్ప ఈశ్వర్ ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన కిసాన్‌సెల్ అధ్యక్షుడు అల్వాల నాగరాజుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మంగళవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

జాగ్రత్తలు పాటించాలి



రాజోళి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం దోమల నివారణ మందు స్ప్రే చేశారు. మురుగుకాల్వల్లో బ్లీచింగ్ పౌండర్ చల్లారు. అనంతరం ఆర్డీటీ కాలనీలో ఇంటింటికెళ్లి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో జయప్రకాష్, విజయ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతు చేయండి

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, మాన్‌దొడ్డి తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోడ్లను పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా మారాయని, ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్ల మరమ్మతుపై నిర్లక్ష్యం వహిస్తే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

- శిథిలావస్థలో పీజేపీ వంతెన
- కూలిన రక్షణ గోడలు
- పట్టించుకోని అధికారులు



శిథిలమైన జూరాల కాల్వ వంతెన

గద్వాల: జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీ పక్కన జూరాల కాల్వపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన పైపెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటికి కనిపిస్తున్నాయి. రక్షణ గోడలు కూలిపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇనుప చువ్వల వల్ల పాదాచారులకు గాయాలైన ఘటనలు లేకపోలేదు. ప్రమాద తీవ్రతను గుర్తించి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు.. వంతెన రక్షణ గోడల స్థానంలో కట్టెలు కట్టి నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు. ఈ వంతెనపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజురోజుకూ వంతెన పరిస్థితి అధ్వానంగా మారడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదపుటంచుల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని కొత్త వంతెన పనులు..

శిథిలమైన వంతెన స్థానంలో గతేడాది కొత్త వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షాకాలం, సాగునీటి విడుదల సమయంలో పనులను చేపట్టి అర్థాంతరంగా నిలిపివేశారు. వేసవిలో వంతెన పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రస్తుతం జూరాల నీటి విడుదల, వర్షాలు కురుస్తున్న సమయంలో పనులను ప్రారంభించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త వంతెన పనుల్లో జాప్యం జరుగుతుండడంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. శిథిలమైన వంతెనపైనే రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



ఆయిల్‌పాం మొక్క నాటుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్, ఉద్యానశాఖ అధికారి

గద్వాల వ్యవసాయం: ఆయిల్‌పాం సాగుతో రైతులకు లాభం చేకూరుతుందని జెడ్పీ వైస్‌చైర్మన్ సరోజ, ఉద్యానశాఖ జిల్లా అధికారి మహ్మద్‌అలీ అక్బర్ అన్నారు. గద్వాల మండలంలోని బీరెల్లికి చెందిన రైతు రమేష్‌నాయుడు వ్యవసాయ పొలంలో మంగళవారం ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలను వీడి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీనివాసాచారి, ఏఓ ప్రతాప్, ఆయిల్‌పాం అధికారి శశిధర్‌గౌడ్, ఏఈఓ కోటేశ్వరి పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యుడు హన్మంతు

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం షీటీం సేవలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు దివ్యవాణి, హన్మంతు మాట్లాడుతూ బాలికలు, మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే డయల్ 100 లేదా 8712670312 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, భీంరెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మానవపాడులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అలంపూర్ రూరల్: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి ప్రసూనరాణి అన్నారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం యూవిన్ యాప్‌పై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తర్ణాధికారి లక్ష్మీకాంత్, బాలీశ్వరయ్య, లక్ష్మీనారాయణ, అక్కమ్మ, మల్లమ్మ, శ్యామలాదేవి, సువర్ణ, సులోచన, హైమావతి, గుణభాను, మాధవి, దేవమ్మ పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ రిజ్వాన తాన్విర్ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 51మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మల్దకల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ కల్యాణకుమార్ వివరాల మేరకు.. మండలంలోని కాకులారం, పెద్దపల్లి, పాల్వాయి గ్రామాల్లో 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తరలిస్తుండగా, ఎల్కూరు సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఆటోను సీజ్ చేయడంతోపాటు బియ్యం తరలిస్తున్న అరవింద్, మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

28 నుంచి ఇంటర్వ్యూలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28 నుంచి బ్యాంకుల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 86 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు పరిధిలోని అభ్యర్థులకు 28న ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. సీబీఐ, ఎస్‌బీఐ శాంతినగర్, పూడూరు, గద్వాల శాఖల పరిధిలోని అభ్యర్థులకు ఆగస్టు 1న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

మహిళలకు రక్షణ కరువు



అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



గద్వాలలో మాట్లాడుతున్న రాఘవాచారి

గద్వాల అర్బన్: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాషా అధ్యక్షతన మణిపూర్ ఘటనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సహజ వనరులను విదేశీ కార్పొరేట్ శక్తుల పరం చేయడానికి ఈశాన్య భారతంలో ప్రజలను రక్తపు మడుగుల్లో ముంచుతున్నారని ఆరోపించారు. ప్రజలు సంఘటితమై హత్య రాజకీయాలను నిర్వీర్యం చేయాలన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, టీపీఎఫ్ ప్రభాకర్, సీఎల్‌సీ సుభాన్, రైతు సంఘం గోపాల్‌రావు, జాన్ మక్బూల్, అబ్దుల్‌బాబు, రహేమతుల్లా, వామన్‌కుమార్, హనుమంతు ఉన్నారు.

అలంపూర్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న అన్నారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ పట్టణంలోని గాంధీచౌక్‌లో సీఐటీయూ, రైతు సంఘం, కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మహిళలపై అఘాయిత్యాలు చోటుచేసుకున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాలిక్, చిన్నరాయుడు, లాలన్న, అయ్యప్ప, కమలాకర్, నగేష్, నాగేశ్వరమ్మ, సుజాతమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

ఉండవెల్లి: సీఐటీయూ, సీపీఎం, శివసేన, రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శంకర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, హమాలీ వెంకట్రాముడు, షేక్షావలి, సుంకన్నగౌడ్, మురళి, నర్సింహ, నాగరాజు పాల్గొన్నారు.

మానవపాడు: మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను ఖండిస్తూ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహబూబ్ భాషా, రామాంజనేయులు, మాలిక్‌భాషా, ఈశ్వర్, శాలుభాషా, మద్దిలేటి, మురళి, శాంతన్న, సలీం, గోపాల్, భాస్కర్, రమేష్‌గౌడ్, ఖదీర్ పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: మణిపూర్‌లో మహిళలు, యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలను నిలువరించాలని ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. వెంకట్రాములు, వామన్‌కుమార్, ప్రభాకర్, సుభాన్, నవీన్, హనుమాన్, రవి పాల్గొన్నారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయకుమార్

గట్టు: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ విజయకుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలకు మట్టి ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి కుటుంబాలను గుర్తించి పునరావాసం కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరిన గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టవద్దని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ చెన్నయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాం సాబ్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



శాంతినగర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ వడ్డేపల్లి దేవేంద్ర అన్నారు. శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా దేవేంద్రను నియమిస్తున్నట్లు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలని వినతి



జేడీఏకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లాలో సీడ్ పత్తిపంటకు ఎర్రతెగులు సోకి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు ఎర్రతెగులు సోకడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం కంపెనీలతో మాట్లాడి రైతులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, విత్తనాలు కంపెనీలకు ఇచ్చిన మూడు నెలల్లోగా డబ్బులు చెల్లించాలని, జిన్నింగ్ ఖర్చులు కంపెనీలే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, శోభన్, వెంకట్రాములు, వీవీ నర్సింహ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



గద్వాల రూరల్: పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, కేటీదొడ్డి ఎంపీపీ మనోరమ్మ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ధరూరులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

ధరూరు: మండలంలోని వీఆర్‌ఏలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి పేస్కేలు అమలు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గోపాల్, తిమ్మప్ప, నాగేంద్రమ్మ, నరేష్, శ్రీను, ఈదన్న, సుజాత, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం నిర్వహించారు. వీఆర్‌ఏలకు పేస్కేలు అమలు, క్రమబద్ధీకరణకు జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహేంద్ర, యశోద పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ఎమ్మెల్సీ చల్లా

అలంపూర్: హైదరాబాద్‌లో మంగళవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీ వెంట మానవపాడు ఎంపీపీ అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు. అదేవిధంగా మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్, కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలో మంగళవారం త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బీచుపల్లి, వెంకటేష్, పరుశరాముడు, వంశీ, మహేంద్ర, భాస్కర్‌రెడ్డి, పావని, భాగ్యమ్మ, స్వాతి, మహేశ్వరి పాల్గొన్నారు.

ముగ్గురికి జరిమానా

గద్వాల క్రైం: వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో ముగ్గురికి రూ.3వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్‌జడ్జి ఉదయ్‌నాయక్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెచల్ సంజన జాషువా తెలిపారు. గద్వాల మండలం వెంకటోనిపల్లికి చెందిన జమన్నపై అకారణంగా వెంకట్రాములు, వెంకటస్వామి, గోపాల్ పాల్పడినట్లు 2017లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని పేర్కొన్నారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం ముగ్గురు నిందితులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

పోలీసుశాఖకు సహకరించాలి

గద్వాల క్రైం: పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలని సీఐ శ్రీనివాస్ కోరారు. మంగళవారం పట్టణంలోని బీసీ కాలనీలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 48 వాహనలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శ్రీకాంత్, అబ్దుల్ షకూర్ ఉన్నారు.

పథకాల అమలులో విఫలం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని ఇఫ్టూ అనుబంధ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతరేవుల కృష్ణ, ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద కార్మిక గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్మిక గర్జన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యాలయంలో నాయకులు అశోక్, నర్సింహులు, పరుశరాముడు, జమ్మన్న, అంజి, రమేష్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

గద్వాల అర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ టైగర్ జంగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో మంగళవారం సంఘం జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గకరణ సాధనే ధ్యేయంగా ఆగస్టులో చేపట్టిన విశ్వరూప మహాసభపై ఈనెల 31న జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ హాజరు కానున్నరని, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అశోక్, కన్నా, శ్రీను, మోషన్న, ఆంజనేయులు, పరుశరాముడు, తిమ్మప్ప, కోళ్ల మహేష్ ఉన్నారు.

26నుంచి క్యాంపు

మానవపాడు: బెంగళూరులో ఈనెల 26 నుంచి 28వరకు జాతీయస్థాయి యూత్ కాంగ్రెస్ క్యాంపు నిర్వహించనున్నట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి తెలిపారు. మండలంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద మంగళవారం యూత్ కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రతి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జోగుల రవి ఉన్నారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన

మానవపాడు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బురదమయంగా మారిన రోడ్డుపై మంగళవారం కేవీపీఎస్ నాయకులు నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహబూబ్ భాషా, రామాంజనేయులు, రాజు, మాలిక్‌భాషా, ఖదీర్ సలీం, గోపాల్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మానవపాడులో ప్రధాన రహదారిపై నాటు వేస్తున్న కేవీపీఎస్ నాయకులు